# ప్రేమపరిణామము

సాహిత్యసరస్వతి సికిపి ఆంజనేయులు గారు

(భారతి రెండవసంపుటము—ఎనిమిదవసంచిక తరువాయి.)

## షష్ఠప్రకరణము

జయపురమున సౌధవాటికలలోఁ గలవరము చాల హెచ్చియుండెను. పౌరు లన్నికడల నెడయిడి గుంపులుగుంపులుగఁ గూడి గుజగుజలు వోవుచుండిరి. పలువురు పలుతెఱఁగుల సమవిచారమును బ్రకటించుచుండిరి. బిడ్డలతల్లులు హేమకుమారుని గుణగౌరవముల నొక్కొక్కటొక్కటిగఁ జెప్పికొనుచుఁ గన్నసంతుఁ గోల్పోయిన విధమునఁ గన్నుల నీరునిండ శోకించుచు, మహేంద్రనాథుని మేడవైపు వడివడిగ నడచుచుండిరి. శేమ మన నదెచ్చటను లేదు. ఎల్లెడల నిరుత్సాహము, విషాదము నిండియుండెను.

ఆహా; ఆ పాపాంతఃకరణుఁ డెంతపని చేసినాఁడు! ఒక మహోత్తమజీవమును దృణములీలఁ గోలియించినాఁడు. దైవనిర్మితమైన యొక యమూల్య సుందరాలంకారమును త్రుటిలో వికల మొనర్చినాఁడు. దాని రూపనామక్రియల నీ ప్రపంచసౌధమునుండి మాయము చేసినాఁడు. హేమకుమారుఁ డనుపమప్రతిభాశాలి. పరోపకారపారీణుఁడు. మీఁదు మిక్కిలి దయావంతుఁడు. జయపురమునకు దేహము. పౌరమండలికిఁ బ్రాణము. ఆ యుత్కృష్టజీవ మీభౌతికలోకమును వీడిపోయినది. అయ్యో! జీవరహితమైన దేహ మేమి చేయఁగలదు?

హేమకుమారుఁ డెందఱియెడల సమగౌరవోద్రేకముననే మెలఁగుచుండువాఁడు. అతఁ డింతవఱకు నెట్టి యల్పజీవినైన నలక్ష్యభావమునఁ జూచియుండలేదు. ఎవ్వరి విషయమున నెటువంటి యహితమును దలపోసి యెఱుఁగఁడు. అతనిమానస మన్ననో పులుఁగడిగిన ముత్తెమట్టిది. ఆ పవిత్రునియెడల నెవని కలుషహృదయ మింతటి ద్రోహచింతనమునకు గుఱియైయుండును? ఎవ్వని ప్రహారహస్త మీ ఘాతుకకర్మము నొనర్చియుండును? ఏ పాషండుని మలినఖడ్గ మీ ఘోరవ్యాపారమునకుఁ గారణమైయుండును? జానపదుల కది బోధపడలేదు. ఆ విషయమునుగూర్చి యనేకు లనేకవిధముల వితర్కింపఁ జొచ్చిరి. హేమకుమారునిహత్యకు సురేంద్రకుమారుఁడే హేతువనుట బహుజనాభిప్రాయము.

సురేంద్రకుమారుఁడు హేమకుమారుని జ్ఞాతియని మాత్రము వెనుకఁ దెల్పియుంటిమి. శైశవప్రాయముననే యాతని జననీజనకులు కాలప్రవాహమునఁ బడిపోయిరి. అట్టితఱి దేవేంద్రనాథుఁడే యా బాలకునిఁ జేరఁదీసి, పోషించి, యుద్వాహము చేసెను. అనంతరము సురేంద్రుఁడు భార్యకు వశుఁడై యామె యిచ్ఛానుసారముగ వర్తించి, దేవేంద్రనాథున కెదురొడ్డి మాటలాడెను. వెంటనే దేవేంద్రనాథుఁడు సురేంద్రుని భాగధనము నాతనివశము చేసి, యా కుటుంబమును బ్రత్యేకముగ నుంచెను. నాఁటఁగోలె సురేంద్రుఁడు భోగైకతత్పరుఁడై యందుల కనువగు మార్గమునఁ బిత్రార్జితధనమును యథేష్టముగా వ్యయముచేయ దొరఁకొనెను. అంతియకాక సురేంద్రుఁ డతిచారులను జూదరులను ద్రాగుఁబోతులను జేరఁదీసి, విత్తము క్షయమార్గమున వెడల నడుపుచుండెను.

దుర్వ్యయపరున కేది నిలుచును? ఎంతటి మహత్తర భాగ్యమైన నాతని కేమాత్రము? మహామేరువు సహిత మాచంచలచిత్తుని కరతలమున, నొక పరమాణువువోలె జాఱిపోఁగలదు. సురేంద్రుని యైశ్వర్యము విషయవాంఛలలోను, విలాసవైభవాదులలోను, జూదరుల హస్త

లాఘవములలోను, పానప్రియుల వాచావిడంబనమునను, జారవనితల మోహజాలమునను దగులుకొని, యచిరకాలముననే యంతరించెను. ఇట్లు తనసంపదయంతయు విఱిగి పోయినందున నాతని కావంతయేని విచారము కలుగ లేదు; కాని దేవేంద్రనాథుని సిరి పెరుఁగుట నాతఁడు చూడఁజాలక, మిక్కిలి క్రుంగిపోయెను. క్రమక్రమముగ మాత్సర్యము హెచ్చెను.

దేవేంద్రనాథునకుఁ గుమారుఁ డొక్కఁడే. ఏ హేతువుననైన నాబాలున కహితము గావించినచో, నిఁక దేవేంద్రనాథుని యైశ్వర్యధామమున కన్యుఁడు నాయకుఁడు కాఁజాలఁడు. ఇది సురేంద్రుని యభిమతము. ఇట్లు తలపోసి యందులకతఁ డనేకతంత్రములఁ బన్నెను. ఆతని ప్రయత్నములలో నొక్కటియు ఫలింపలేదు. మనోరథమును సిద్ధింపలేదు. తనకృషి నిరుపయోగమగుటయ కాక, సర్వన వ్యవహారమంతయు బయల్పడుటచే, నాతఁడు పరాభూతుఁడై యటనుండి భార్యతో నెచ్చటికో పాఱిపోయెను. అనంతర మాతనియునికియే తెలియరాలేదు.

గత ప్రకరణమునందలి క్రూరకార్యము నడచిన నాఁటి సాయంకాలసమయమున, రామదేవశర్మ తనగృహమున నాతనిమిత్రుఁ డగు సోమదత్తునితో నీక్రిందిసంభాషణము సలిపెను.

రామ—అట్టి ప్రాణప్రియుఁడగు నెయ్యుని మన మిఁకఁ జూడలేము. అయ్యో! తనువులు వేఱైనను మనసం బులకుఁ బ్రాణ మొక్కటియేకదా? హేమకుమారుని పాలి కాదౌర్భాగ్యుఁడే చిచ్చుఱపిడుగయ్యెనని నీవు చెప్పుమంటివా?

సోమ—ఔను. ఆ నృశంసుఁడే యింతటినిర్ఘృణకర్మము నొనర్చినాఁడు. దైవాజ్ఞ నతిక్రమించి యిట్టి ఘోర పాపాచరణ మొనరించిన యా పాషండుఁడు మనకు లభించు టెట్లు?

రామ—అనేకు లాతనిఁగూర్చియే సంశయించుచున్నారు; కాని నాకు నమ్మకము లేదు. సురేంద్రుఁ డిఁకను జీవించియుండఁడు.

సోమ—జీవించియేయున్నాఁడు. నిశ్చయముగ సురేంద్రుఁడు మరణింపలేదు.

రామ—నాఁడు మనచే నియోగింపఁబడిన గూఢచారులంతటను వెదకి, యాతనిఁ గానక తిరిగివచ్చిరికదా? ప్రాణములతో నుండిన సురేంద్రుఁ డొక్కరికైన నగుపడక యెట్లు తప్పిపోయియుండును?

సోమ—ఆతఁడు వేషధారియయి వెదుకఁబోయినవారి కన్నులఁ గప్పుచున్నాఁడు.

రామ—అట్లు పరిభ్రమించునంతటి ప్రాణాపాయదశ సురేంద్రున కేమి వాటిల్లినది?

సోమ—ఆతనిదీక్ష యొక్కటియే. అది తీఱునందాఁక నాతఁ డావృత్తినుండి విడివడఁడు. మూఢుఁడు; ఇఁక కొంతకాలమున కాతఁడు తనంతనే దర్శనమీయఁగలఁడు?

రామ—నేఁటి మధ్యాహ్నమున నేను హేమకుమారుని సందర్శింపఁబోయి యాతనితో సంభాషించుచుండఁగా, నొక పురుషుఁడు మేమున్న మందిరమునకు వచ్చెను. ఆతనిరూప మేవిధమునను సురేంద్రుని యాకృతినిఁ బోలియుండలేదు.

సోమ—ఏలాగైనను మన మాతనిఁ గనుఁగొను విషయమున దృఢతరప్రయత్నమే చేయవలయును. శక్తిసంపన్నులగు జంఘాలుర నెల్లకడలకుఁ బంపి, యా హంతకునిబట్టి తెప్పింపవలెను.

రామ—నే నింతవఱకే పలువురను బలుతావులకుఁ బంపినాఁడను. రహస్యస్థానముల సంశోధింపఁ గొందఱ ననిచితిని. పోయినవారు మాయమర్మములఁ జతురు లగుట నెట్టైన నాధర్మఘాతకుని గొనితేకమానరు.

సోమ—చారులు పూనికతోఁ దమ పరిశ్రమను సార్థకము చేసికొని రావలసియున్నది. దేవేంద్రనాథుఁడు పురిఁ జేరునప్పటికి మనము రాక్షసుని శల్యఖండముగైన మిగుల నీయరాదు. నేఁటితిథి?

రామ—అమావాస్య.

సోమ—ఐనచో, దేవేంద్రనాథుఁడు రెండుదినములకుఁ గాని బయలుదేఱఁ డనుట ధ్రువమైనది. చీఁకటిలోఁ ద్రోవతెలియక కష్టపడెడు నా కిరాతకునిఁ బట్టి తెచ్చుట కీనిశాసమయము మిక్కిలియనువుగ నున్నది.

## సప్తమప్రకరణము

ఛిన్నోపి రోహతి తరుః క్షీణోప్యుపచీయతే పునశ్చన్ద్రః,
ఇతి విమృశన్తస్సన్తః సన్తప్యన్తే నవిప్లుతా లోకే.

— భర్తృహరి.

ఆ యమావాస్యరాత్రి స్వభావసిద్ధముగఁ గాఱుచీఁకటు లంతటను వ్యాపించియుండెను. అందులకుఁ దోడు జలవసంచయ మాకసమునం దన్నియెడల నిబిడముగ నావరించి యుండెను. ఇది హేతువుగఁ జిక్కని తమస్సార మన్నికడలఁ జిమ్ముచేఁగఁ గ్రుమ్మరించినపోల్కి నుండెను. విద్యుల్లతావితానము లాకస్మికముగ నందందుఁ బొడకట్టుచు, క్షణక్షణము నదృశ్యము లగుచుండెను. దిశలు మారోత్ఫ్రిఁగఁ గాదంబినీముఖాంతరాళముల నుండి భయంకర స్తనితము లతిదారుణముగ, శ్రవణపుటవిదారణముగ, బయల్వెడలుచుండెను. ఒక్కొక్కతఱి ఘాతుకవన సత్త్వముల భీషణగర్జన లామేఘనిర్ఘోషములలో నైక్య మొందుచుఁ, బ్రాణివర్గమున కాతమస్వినీసమయము ప్రళయకాలముగఁదోఁపింపఁజాలియుండెను. చేతనాచేతన ప్రకృతియెల్ల, నా గాఢాంధకార గర్భమున నణఁగియుండెను.

అట్టి భయానక కాళనిశీథినీసమయమున నొక పురుషుఁ డడవులఁబడి వారువముతీరునఁ బరుగిడుచుండెను. అతఁ డెందుండి బయలుదేఱెనో, యెచ్చటి కరుగుచుండెనో, గమ్యస్థాన మతని కెద్దియో, యా పురుషునకే గ్రాహ్యమైయుండదు.

ఆ పాంథున కొక్కపథము లేదు; నియామకము నొక్కమార్గమును లేదు. మిట్టయనక పల్లమనక వనగిరిప్రాయ విషమప్రదేశములఁ జిక్కినదారి నేగుచు, భీమసత్వంబగు నా నిబిడతిమిరావరణమధ్యమున నెల్లయెడలఁ గ్రుమ్మరుచు, నమ్మనుజుఁ డొక్కచోఁ దటాలున నిర్ఘాంతపడి నిలిచెను.

ఆ మానవుని యద్భుతగమనవేగము నట్లవరోధించిన దెవరు? అమ్మహాశక్తి యేదియైయుండును? అది యొకానొక యపూర్వవ్యక్తి. హఠాత్తుగ నెదురై యామూర్తి తెరువరినిబట్టి యాఁపెను. వ్యక్తిస్వరూపము మాత్ర మా మానవునకు వ్యక్తము కాలేదు.

ఆ వివిక్తప్రదేశమున, సాంద్రజీమూతపరివ్యాప్తమగు నా భైరవారణ్యమున, ఆదుర్దినము, అట్టి దుస్సమయమున, ఈ యపూర్వప్రదర్శన మాపురుషుని నిర్విణ్ణునిఁ జేసివైచెను. తత్క్షణమే యాతఁ డూర్ధ్వముఖుఁడై, వికృతస్వరమునఁ గఠోరముగ నఱచెను.

"దిగులుపడవలదు. నా కభిముఖుఁడగు మానవుఁ డెట్టియాపదయుఁ బొరయరాదు. ఈ ఘోరకాంతారమధ్యమున దారితెలియక కిట్టుల పరిభ్రమించెదవు? ఇది నీకు శ్రేయస్కరము గాదు. నీవిఁకఁ గొన్ని నిమిషములైన నిందే ప్రవర్తించుమన్నచో, నిందలి ఘాతుక వన్యమృగోపద్రవమునుండి తొలఁగి చననేరవు. ఇట్టితఱి క్షేమకరమార్గ మవలంబించుట నీకు యుక్తము; కనుక నను వెంబడింపుము." అని మృదుమధురముగఁ బల్కుచుఁ దనసాధుస్వభావమును వెల్లడించెను. తదుపరి పాంథుని మౌనభావమును గమనించి, యావ్యక్తి ముందునడిచెను. వెనుకంజ వేయఁజాలక, తొలఁగిపోవ నుపాయాంతరము గానక, నిశ్శబ్దముగ నమ్మనుష్యుఁ డావ్యక్తిని వెంబడించెను. ఇట్లెంతదవ్వు త్రోవసాగినదో తెలియదు. కొండొకకాలమునకు వా రొకానొక జనపదము చేరిరి.

పురప్రవేశము చేసి, యావ్యక్తి యున్నతప్రాకారవేష్టితమగు నొకవిశాలభవనముఁ జొచ్చెను. దానితోఁ బురుషుఁడు సహిత మనుగమించెను. ఆమూర్తి యాతని నొకగదిలోనికిఁ గొనిపోయి, "నీవిందే వసింపుము. నేను గొన్నిక్షణములలో నీకుఁ దోడిచ్చిపంపెదను." అని యాజ్ఞాపించెను. పురుషుఁ డావాక్యముల నంగీకరించినమాడ్కి మాటాడక యం దొక్కచోఁ గూరుచుండెను. వ్యక్తియు నచ్చటనుండి బయలుదేఱి బహిర్ద్వారములను బంధించి వెళ్లెను.

కొంతవడికి గృహప్రాకారకవాటముల నెవ్వరో త్రోసినట్టు లయ్యెను. లోననున్న పురుషునిగుండె జల్లుమనెను. అతఁ డచ్చటనుండి పాఱిపోవఁ బ్రయత్నించెను; కాని భయాతిరేకమున నాతనియంగములు పట్టుసడలి యవశములైయుండెను. వామహస్తమున నొకదివ్వెయుఁ గుడిచేత నాహారపాత్రముల దొంతరయుఁబట్టి, యున్నతకాయుఁ డొక్కఁ డాపాంథునిముందఁ బ్రసన్నవదనమున సాక్షాత్కరించెను.

"నీకై వాహనవ్యూహ మేర్పఱుపఁబడినది. నాయనా! నీవీయాహారము భుజించి ప్రయాణసంసిద్ధుఁడవు కమ్ము" అని పలుకుచు, నాయాగంతుకుఁడు తాను దెచ్చిన భోజనపాత్రములందొంతి నాయధ్వగున కొసఁగెను. భయవిస్మయములు పెనఁగొనఁ బథికుఁ డద్దాని నందికొని, భీతసంచలితచేతస్కుఁ డగుటం జేసి, యయ్యాహారమున నొక్కింత చవిచూచి, గమనోన్ముఖుం డయ్యెను. ఉన్నతమూర్తి పాంథుని కభిముఖుఁడై యాతని కంపితహస్తమును దన దక్షిణకరమునఁబట్టి, యిట్లనెను.

"నాయనుంగుమిత్రుఁడా! నీ వెవ్వఁడవైనను నా కాత్మీయసోదరుఁడవె. నిన్నుఁ గూర్చి విశేషము లారయఁ గోరుట నామతము కాదు. ప్రకృతి విషమదశయం దొక్కొక్కక్షణమైనఁ గ్రొత్తవార లిందుఁ దడయుట ప్రసంగకారణ మగును. నేఁడీయూర నొకభయంకరసంఘటనము సంభవించినది. జలమునకు రసమువలెను, జ్వలనమునకుఁ గాంతివలెను, నెవ్వఁడీపట్టణమునకుఁ బ్రాణసముఁడుగ నుండి యానందదాతయని పేర్వడసెనో, నక్షత్రమండలమున విరాజిల్లు శీతమయూఖునివంటివాఁ డేపురుషుఁడా పౌరులకుఁ దిలకప్రాయుఁడై పాయనిబంధువై యుండెనో, ఎవ్వఁడు నిర్మలకర్మయోగసాధనాన్వితుఁ డగుచు ధర్మమార్గాంచితులకెల్ల ధర్మమూర్తియై వెలిఁగెనో, ఎల్లవేళలఁ దనవాగమృతవృష్టిచే మిత్రమండలిని దనియించుచుఁ గ్రోధమన నెట్టిదో యెఱుంగక యెవ్వాఁడు శాంత్యైకతత్పరుఁడని విలసిల్లెనో, పారలౌకిక మెవ్వానిప్రాపు మహామేరువట్లు తలంచి దానిఁ గాంక్షించియుండెనో, ఏకరుణాప్రియుఁ డతిథిదేవతల కాత్మసమర్పణంబైనఁ జేయ సంసిద్ధుఁడైయుండెనో, ఆదయానందదాత, ఆధర్మమూర్తి, ఆశాంత్యైకతత్పరుఁడు, ఆయతిథిపూజాధురంధరుఁడు, ఆహేమకుమారరత్నము, నేఁడొక్క యాత్మీయబాంధవుని నిశితాసికిఁ దనయుష్ణశోణితమును గ్రుమ్మరించి, యైహికవాంఛలనుండి విరమించి, పరమాత్మ కాత్మసమర్పణముం బొనరించెను. స్వీయజీవితానంతరము ప్రజాపక్షమునఁ దనసర్వాభిమతముల నేకపుత్రుఁ డొక్కరుండ నెఱవేర్ప సమర్థుండని యెంచి, యెవ్వఁడు నిర్విచారపరుఁడై యుండెనో, ఆ యభాగ్యజనకుఁడగు దేవేంద్రుఁడే తన యతిథిదేవున కిట్టి యనిష్టదాయకవార్తచే విచారముఁ గూర్చుచున్నందులకు, తండ్రీ! కరుణించి క్షమింపుము."

శాంతస్వభావ ముట్టిపడునట్లు, అమృతధార లొలుకునట్లు, హృదయము కరఁగునట్లు, మృదులముగ, మధురముగ, కరుణారసభరితముగ నట్లు పలికిన యా ప్రశాంతహృదయుఁడే, ఆయున్నతమూర్తియే, ఆదివ్యవ్యక్తియే, హేమాకుమారుని పితృదేవుఁడగు దేవేంద్రనాగుఁడని యాయధ్వగుఁడు గ్రహింపఁగల్గెను. ఈ సందర్భమునఁ బాంథునకుఁ దెలియకయే, దేవేంద్రనాగుని నయనయుగళి నుండి, యాకస్మికముగ వేఁడిబాష్పకణము లొకటి రెండు పథికుని కరతలమున నురలెను. ఆపలుకులలో నెట్టి శక్తి యుండెనో, ఆ యుష్ణాంబుశీకరముల నేమి మాహాత్మ్య మావిర్భవించెనో మనకుఁ దెలియదు; కాని తత్క్షణమే పాంథుని రక్తవాహినులలోని రుధిర మత్యంత తీవ్రగతిఁ బ్రచలిత మయ్యెను. ఆతనివదనబింబమున దైన్యవిచారమేఘ మావృత మయ్యెను. ఆ దీనుని మలినాపాంగకుహరయుగ్మమునుండి స్రవించు నుష్ణాశ్రుధారలు, ఆతని భావజలధినిఁ గాఁచుచున్న చండతరదావాగ్నికిఁ బ్రబలాదర్శ మయియుండెను. ఆ సందర్భమునందలి యాతని మనస్స్థితిని గూర్చి యథావిధమున వర్ణింపఁజాలము. తన వృజినకర్మముఁ దలపోయు కొలఁదిని గాఁబోలు, నా పురుషుఁడు నిలువునఁ గంపించిపోవుచుండెను.

ఏ హేతువుననో హఠాత్తుగ నాపురుషుని యశ్రుధారాప్రవాహ మాఁగిపోయెను. ఆతని ముఖబింబమునందలి నీలమేఘావరణము తనంతఁ దొలఁగిపోయెను. దైన్యము, భయము, నందుండి యదృశ్య మయ్యెను. దినావసానసమయ పశ్చిమాకాశముంబోలె, నాతని వదనమండలము రుధిరవర్ణసమాకీర్ణ మయ్యెను. ఆ యధ్వగుఁడు స్థాణువుపోలె నిలిచి, దేవేంద్రనాగునివంక నిశ్చలదృష్టి నీక్షించుచున్నట్టే, యా పురుషుని దక్షిణకరము వామపార్శ్వకటిప్రదేశమును దడవుచు, నందు చర్మావలగ్నబంధమునఁ గల యొఱనుండి, శాతకృపాణమును బైకిలాగెను. పథికుఁడు దేవేంద్రనాగున కద్దానిని జూపుచు నిట్లనెను.

"ఓ కృపామయమూర్తీ! ఇదిగో! ఈ శోణితఖడ్గముఁ గొని యీ క్షణము దురంతదురితకర్ముఁడ నగు నన్ను నున్మూలింపుఁడు. మీ రింతవఱకు నే లోకహితైక

పంకయుణునిఁ గూర్చి సెలవిచ్చితిరో, యా దివ్యదయాధౌరేయుని, ఆ నవకోమలమృదుశరీరుని, ఆ పరమపూజ్యుని, జంపిన దుష్టుఁడను, నిష్ఠురుఁడను, కడు నికృష్టుఁడను, నేనే; నిస్సంశయముగ నేనే. అట్టి పాపండుని, కలుషకర్ముని, నన్ను ఇఁక నొక్కత్రుటికాలమైనఁ బ్రాణములతో వదలవలదు. ఆహా! నా యొనర్చిన మహాపరాధమునకు, ఘోరకల్మష కర్మమునకు, నీ భౌతికప్రపంచమున నిష్కృతిగలదా? ఓ మహాత్మా! ఈ నృశంసుని యంగముల వేర్వేఱ ఖండఖండములుగ నొనర్చి, చిత్రవధ గావించి, ప్రపంచభారముఁ దీర్పుఁడు. అయ్యో! నే నింతకును దగనా? నా కట్టిభాగ్యమును లేదా? నా పాపమునకదియుఁ బ్రాయశ్చిత్తము కాఁజాలదా?"

ఉన్మత్తునిగతి నిట్లు పలువరించుచు, నా పాంథుఁడు, ఆ రుద్రదత్తుఁడు (ఆతఁడు రుద్రదత్తుఁడే) వక్షమును జీల్చుకొని ప్రాణత్యాగ మొనరింపఁ దనకరవాలమును పైకెత్తి, ఱొమ్మునఁ గ్రుచ్చుకొనఁ దివిరెను. దేవేంద్రనాథుఁడు విస్మయవ్యాకులితాంతరంగుఁడై రుద్రదత్తుఁ డెత్తిన కరమునుబట్టి, "ఆఁగు మాఁగుము. వత్సా! ఇట్టి భయంకరవ్యాపారమునకు సాహసింపవలదు. సల్పినది యకృత్యమని తలఁచి నీ వనుతప్తచిత్తుఁడవైతివి; అంతియ చాలును. నేను నా కుమారుఁడు బ్రతికియున్నట్లెంతును. ఆతని ప్రతిబింబమును నీ నిర్మలమనోదర్పణమునఁ జూచి యానందింపఁగలను. అట్టి యాశాకిరణ మిప్పుడు నా శూన్యహృదయకాంతరాళమునఁ బొడచూపుచున్నది. పుత్త్రకా! నీ విఁకను దడవుసేయవలదు. వాయువేగమున నినుఁగొనిపోవఁగల వారువము బహిర్ద్వారమున నీకై నిరీక్షించి యున్నది. నీవు దాని నారోహించి యీ రాత్రియే బహుదూరము పొమ్మ" అనెను.

రుద్రదత్తుఁడు మనోవిప్లవము చే రోదనము సేయుచు, పరితాపభరమున దేవేంద్రనాథుని చరణములపై వ్రాలి, "ఓ దేవా! పరమకరుణాస్వభావా! ఈ క్రూరకిరాతకుఁడు, ఈ వజ్రకఠోరహృదయుఁడు, ఇమ్మహాదస్యుఁడు, ఈ పాపవాంతకుఁడు క్షమాపణార్హుఁడేనా?" యనెను. దేవేంద్రనాథుఁ డాతనిఁ దనహస్తయుగళములఁబట్టి యెత్తి, "కుమారా! నీ యపరాధములు క్షమింపఁబడినవి. ఆ దయాసముద్రుఁడు, ఆ యభయప్రదాత, ఆ జగద్రక్షకుఁడు, నీ హృదయశోధనముఁ గావించిన యాసర్వాంతర్యామి, నిన్నాశీర్వదించెను; కనుక నీ విందుండి సౌఖ్యముగ మరలిపోవుటయే నాకుఁ బ్రథమప్రయోజనము." అని సాదరపూర్వకముగఁ బలికెను.

రుద్రదత్తుఁడు మఱిమాటాడలేదు. తనకలుషకర్మ మొక్కవిధమునఁ దన్ను గ్రసించుచుండ, నాతఁ డత్యంతఁ బరిభూతాంతరంగుఁడై, ఖిన్నుఁడై, మిగుల వినీతభావమునఁ బ్రాంగణమువఱకు నిర్గమించెను. పిమ్మట విచారపూరితస్వాంతమున నాతఁడు దేవేంద్రనాథుని వంకఁ జూడ్కిసారించి, శిరమువంచి, యాత్మాభివందన మాచరించి యశ్వారోహణ మొనరించెను. వెంటనే యాశ్వికుని హస్తసంజ్ఞ నెఱింగిన యాభద్రవినీతము శరవేగమునఁ బరువువాఱి, యా చిమ్మచీఁకటిలో నదృశ్య మయ్యెను. ఆ భయంకర నిశీథమున, నా దారుణాంధతమస మధ్యమున నా తురంగరాజ మెందేగెనో దేవేంద్రనాథునకుఁ దెలియలేదు.

## అష్టమ ప్రకరణము

నిరంతర మతిథిపూజలచేఁ దనరారుచుండెడు దేవేంద్రనాథుని నిశాంతరాజ మెంతయును గాంతిఁ దక్కి, మిగులఁ జిన్నవోయి యుండెను. నేఁ డేయతిథియు నా మందిరమును దనపాదరజోలేశమునఁ బావన మొనరించుచుండలేదు. వారి సత్కారప్రాప్తిఁ గోరి పరిచారకగణము ద్వారపార్శ్వముల వేచియుండలేదు. మహనీయు లగు నా యతిథిజనుల చరణపద్మములను స్పృశించు భాగ్యమునకై గృహకాంతలు నిరీక్షించియుండలేదు. ఆహర్మ్యమున మనుష్యసంచారమే లేదు. అది యొకానొక నిర్జనకాంతారమువోలె భయంకరముగఁ జూపట్టుచుండెను. సముజ్జ్వలకాంతుల నీనెడు దీపశిఖలు నేఁ డపూజితములై విన్నఁదనమున మినుకుమినుక్కు మని మెఱయుచుండెను.

అట్లు రుద్రదత్తుని వీడ్కొల్పి, నిరపాయముగ నాతని స్వస్థలముఁజేర్పఁ బరమాత్మను బ్రార్థించుచు దేవేంద్రనాథుఁ డచ్చోటువాసి, యిలుచేరెను. ఆతఁ డంతటి క్రిందియంతస్తును గడచి మీఁదియంతస్థునకుఁ బోయి, యందలి ప్రత్యేకగృహముఁ జొచ్చెను. గది మధ్యమునఁ జిన్నదివ్వె యొకటి వెలుఁగుచుండెను. దాని పార్శ్వ

భాగమున హేమకుమారుని రక్తమయకళేబరము పడియుండెను. అంబికాదేవి దుఃఖవిశీర్ణహృదయయై ప్రియతనూజుని మృదుగాత్రమున నొఱగియుండెను కొందఱు పురంధ్రులు, పరిచారికలు చుట్టునుమూగి, దురంత దుఃఖసాగరమున మునిఁగియుండిరి. గది యెంతయు నిశ్శబ్దముగ నుండెను.

దేవేంద్రనాథుఁ డాభయానకదృశ్యమును జూచుచుఁ జూచుచు స్థాణువువోలె నిలుచుండి, యట్లే కనులు వాల్చి, యచలధ్యానసమాధిం జెందెను. పిమ్మటఁ గొంతసేపటికి దుఃఖోపశాంతి నొందినవాఁడై ముందునకు దృష్టిసారించెను. తత్క్షణ మాతనివదన మండలమున వికాస మంకురించెను. నేత్రయుగ్మములు ప్రదీప్తము లయ్యెను. ఉన్నట్టుండి తన దృక్పథమున సాక్షాత్కరించిన మహనీయుఁడు శివానందయోగి యని గ్రహించి, దేవేంద్రనాథుఁ డామహామూర్తికి సాష్టాంగదండప్రణామము లాచరించి, యోగిపుంగవుని చరణయుగళి నానందసలిలధారలచేఁ బరిషేచనముఁ గావించెను.

శివానందయోగి ప్రశాంతమనస్కుఁడై, దేవేంద్రనాథునిఁ దనహస్తమునఁ బట్టిలేవనెత్తి, "ప్రియభక్తుఁడా! శత్రువులకు మిత్రుఁడవగు నీకుఁ గష్టపరంపరలు పైకొనుట యస్వాభావికము కాదు. అట్టిచో నిన్నుఁబోలు పురుషవరేణ్యు లెట్టి భావాంతరములను బొందరు. దుఃఖమును దుఃఖముగాఁ జూచుట కొందఱికి మతమగును. సంసారసాగరమునఁ బతితులై, దరిగానకున్నవారి కిది సహజధర్మమే. నీలక్షణ మదికాదు. నీవు దుఃఖస్వరూపము నానందభావమునఁ బూజింతువు. జీవితమహార్ణవమధ్యమున, సుఖదుఃఖతరంగసందోహమున నీస్థిరహృదయ మెట్టి చంచలనమును బరిణామమును బొందుచుండుట లేదు. కనుకనే యేవిపత్తును నినుఁ గారియపెట్ట నోడుచున్నది. నీయట్టి దృఢసంకల్పునకు, అచంచలస్వాంతునకు సంసారమొక్క యల్పకాసారమే కాని మహాసాగరము మాత్రము కాఁజాలదు. వత్సా! నీవు రాజయోగివి. పరమపిత యగు నీశ్వరుఁడు నీ మహత్తరయోగరహస్యము నెఱింగి, పరితృప్తుఁ డయ్యెను. నీసుతుఁ డన్ననో వినిర్మల నిష్కర్మనిరతుఁడు. అట్టి సుగుణనిధి నొకరొక్కఁడు దుస్సహాఘాతశైలపఙ్క్తులు, అప్రమత్తతూలికాసహస్రమునుంబోలె లేవఁ గలవు. కుమారా! పుత్త్రవియోగవ్యథ నీకులేదు. నీ మానస మట్టి విచారలేశమునకు నెడమీయలేదు; కాని యీ హేమకుమారుని లోకసేవ యొక్కటియె నీకాంక్షితార్థమయియున్నది. నీయాశయ ముదారగుణసమన్వితమైనది. దానికిఁ బ్రతిహతి లేదు. నీతనయుఁడు మూర్ఛావస్థనుండి తొలఁగి యెప్పటిదశను బొంది, నీ సదుద్యమబీజముల నీప్రపంచమున సహస్రముఖముల వెదచల్లుటకు సమర్థుఁ డగును" ఇట్లు సెలవిచ్చి శివానందయోగి యంతర్థానుఁ డయ్యెను.

ఆపన్నగ్రస్తుఁడై, యంతర్మనస్కుఁడై మూర్ఛనొంది, నిశ్చేష్టితుఁడై పడియున్న హేమకుమారుఁడు, కొంతవడి కించుక చలించి, బాధ సూచించెను. శివానందయోగి సెలవిచ్చినట్లు హేమకుమారుఁడు మృతినొందియుండలేదు. రుద్రపతునిఖడ్గము హేమకుమారుని విగతజీవునిగ నొనర్చియుండలేదు. దేవేంద్రనాథుఁ డాత్మజుని సమీపించి, ఉరుమండి గాయమునుజూచి, యది ప్రాణాపాయకరము కాఁజాలదని గ్రహించెను. ఆ యపూర్వప్రవర్తన మచ్చటి జనసముదాయము నద్భుతప్రమోదజలనిధిం దేల్చెను.

దేవేంద్రనాథుఁడు శస్త్రచికిత్సయం దెంతయుఁ గుశలుఁ డగుటచే, నత్యంతావధానముతో మిగుల నైపుణ్యముగఁ గుమారున కుచితచికిత్సల నొనర్పసాగెను.

## నవమప్రకరణము

అచిరకాలముననే హేమకుమారుని వ్రణము మానెను. ఆతని దౌర్బల్యమును గ్రమక్రమముగ క్షీణించెను. బలవృద్ధికరము లగు నాహారపదార్థములను భుజించుచున్నందున నతఁ డత్యంత శీఘ్రకాలములో, యథావిధముగఁ బుష్టశరీరుఁ డయ్యెను.

హేమకుమారుఁడు పరిపూర్ణారోగ్యవంతుఁ డగుటచే నాతనివివాహమున కుచిత ప్రయత్నములఁ గావించుట దేవేంద్రనాథునకుఁ దప్పనిసరి యయ్యెను. యోగ్యుఁడగు వరుఁడు లభించునేని కాత్యాయనీకుమారికిఁగూడ నుద్వాహ మొనర్చుటకు, దేవేంద్రనాథుఁడు కృతనిశ్చయుఁడయ్యెను. హేమకుమారున కింకను వధువు నిర్ణయింపఁబడలేదు. దేవేంద్రనాథుఁ డింతకుఁ బూర్వము, గ్రామాం

తరసంచారము పూనియున్న సందర్భమున, నందుకొఱకై పెక్కుచోట్లు తిరిగెను. కుమారున కనుకూలవతి యగు వధువును, కాత్యాయిని కొదవిన వసుఁడును దేవేంద్రనాథున కెందును గోచరింపలేదు. ఉమేశచంద్రుని కుమారీరత్న మొకర్తుకమాత్ర మాతని యభిమతముల కెంతయును డగియుండెను.

ఉమేశచంద్రుఁడు శ్యామపురవాసుఁడు. ఆతని కోశాగారము రత్ననిధానము కాదు. ఆతఁడాగర్భదరిద్రుఁడే; కాని యాసుచారిత్రుని దివ్యమానసముమాత్రము విమలగుణరత్నాకరము. ఉమేశచంద్రున కొక్కసూనుఁడు నొక్కసుతయును గలరు. సుత 'ప్రేమపూర్ణ.' ఆ కరుణామయి నిశ్చయముగఁ బ్రేమపూర్ణయే. ఆ కన్యకామణికి రూపమును విద్యయు శీలమును స్వతస్సిద్ధముగ నమరియుండెను. కాని యామె నెవ్వఁడును బెండ్లియాడ సాహసింపలేదు. ఇందులకుఁ గారణ ముమేశచంద్రుని దారిద్ర్యమే.

దిగంతవిశ్రాంతయశోవంతుఁడగు దేవేంద్రనాథుఁడు తన పర్యటనసమయమున నొకనాఁడు తలఁపని తలంపుగ నుమేశచంద్రుని గృహమున బసచేసెను. ఉమేశుని యాతిథ్యమును బ్రీతిపూర్వకముగ స్వీకరించెను. సుకుమారశరీరయుఁ గేవల కృశాంగియు నగు ప్రేమపూర్ణను గనుంగొనెను. తన పుత్త్రిరత్నమున కాసాధుశీల నొసంగవలసిన దని యుమేశచంద్రుని బ్రార్థించెను. ఇవ్వ ల్లనేకకాలముననే తటస్థించెను; కాని యుమేశచంద్రుఁడుమాత్ర మందులకు సమ్మతింపలేదు. ఐశ్వర్యనిధి యగు దేవేంద్రనాథునకుఁ గోడలై యమ్మహనీయుని నుపచరించు భాగ్యము తనకూఁతునకు లేదనియు, నంతటి యదృష్టము నా దురదృష్టవతి నోచుకొనలేదనియు నుమేశచంద్రుఁడు భావించుకొనెను. అందులకుఁ గారణమును లేకపోలేదు.

ఉమేశచంద్రుని పుత్త్రుఁడు పెక్కేండ్లక్రిందటఁ దండ్రితోఁ బగవులాడి దేశాంతరము పోయెను; కాని మార్గమధ్యమున దొంగలకుఁ జిక్కియో యాత్మహత్యగావించుకొనియో యాతఁడు మరణించెనట! వేరులు కొంద జీవృత్తాంత ముమేశచంద్రునకుఁ జెప్పిరి. ఈ విషాదకరవార్త విన్నదిమొదలు ప్రేమపూర్ణ యత్యంతశోకాకులస్వాంతయై యన్నపానములు మాని మిక్కిలి చిక్కిపోయెను. ఇట్టి విషమదశయందే దేవేంద్రనాథుఁడు ప్రేమపూర్ణఁ గాంచుట, తనతనయున కామె నొసంగ వేఁడుట సంభవమయ్యెను.

అనుంగుసోదరుని చిరవియోగవ్యథాభారమున శుష్కించి భ్రాతకై ప్రాణములను మాత్రము నిల్పియున్న ప్రేమపూర్ణకు మనస్స్థిమిత మెక్కడిది? సోదరుని క్షేమోదంతము తెలిసినఁగాని యామెకీ లోకవాంఛయే నిలువదు. ఆ గుణవతికిఁ జిత్తశాంతి కలుగని యంతవఱకు వివాహవార్త స్వప్నగతవృత్తమే యగును. ఉమేశచంద్రుఁడు విచారకరమగు నీసంగతిని దేవేంద్రనాథునకుఁ గష్టముతో నివేదించుకొనెను. దేవేంద్రనాథుఁడు తన కరుణామయ శీతలవాగమృతవృష్టిచే వారి హృదయతాపమును గొంతవఱకుఁ జల్లార్చి, యచ్చటనుండి మరలెను. అనంతరము హేమకుమారునకుఁ గష్టగతి సంప్రాప్తమగుటయు, నందువలన దేవేంద్రునిమానస మన్నివిషయములనుండి యుడిగి తనయుని చికిత్సయందే లగ్న మగుటయుఁ దటస్థించెను.

## దశమప్రకరణము

హేమకుమారుఁడు స్వస్థత నొందినపిమ్మట, నాతనికిఁ గన్యకనిచ్చు విషయమునుగూర్చి సంప్రతించుటకై, పలుతావులనుండి పెక్కండ్రు రాయబారులు చనుదెంచి, దేవేంద్రనాథుని సందర్శింపఁ దొడఁగిరి. వరశుల్కముల క్రింద వేలతరబడి స్వర్ణనిష్కముల రాసిపోయుటకుఁ గూడ ననేకులు సంసిద్ధులై యుండిరి; కాని దేవేంద్రనాథుని యంతరంగమున నేదియు నొప్పిదముగ నుండలేదు. ఘనసంపన్నులతో వియ్యమందఁ గోరికగల దగుటచేత, నంబికాదేవి మగని యిష్టమునకుఁ బ్రతికూలముగఁ బ్రవర్తింపఁజాలనిదైన, నాతని దృఢనిశ్చయము నెఱుఁగఁ గోరి ప్రాణేశునితో నొకనాఁ డిట్లు సంభాషించెను.

అం—కుమారుని వివాహకాలము నింకను బొడిగింపఁ దలంచితిరి కాఁబోలును.

దే—అవును.

అం—ఉమేశచంద్రుని వియ్యము నుద్దేశించియే మీ రిట్లు తామసించుచుంటిరని యూహింతును.

దే—నిశ్చయము.

అం—అతఁడు నిరుపేదయని వినుచున్నాను.

దే—(నిమ్మదిగ) చెప్పుము—చెప్పుము; నీవు చెప్పఁదగిన దంతయు ధారాళముగఁ జెప్పుము.

అం—అట్టివారితో వియ్యమందుట మనపరువున కొక లోపముగాఁ గొందఱు భావించుచున్నారు.

దే—(మధురహాసమున) వారి పేదఱికము మనల నేమి చేయఁగలదు?

అం—దరిద్రులకును ధనికులకును పొత్తుకుదుర దనుట కొందఱి మతము.

దే—అలాగునా! వారినుడువులు మాయెడ నిస్సారములై పోఁగలవు.

అం—దేవా! సెలవిండు, అదెట్లు?

దే—నీ కిష్టమైనచో నీధనలక్ష్మి నీవియ్యంకుని నైశ్వర్య సంపన్నునిగఁ జేయఁజాలదా?

అం—క్షమింపుఁడు. మీ రాతనిపుత్త్రికను జూచివచ్చిన దినమే మాయింట నా ఘోరానర్థము పొసఁగినది.

దే—నిజమే, తరువాత—

అం—అదియొక మహానిష్టసూచకముగ జనులు తలపోయుచున్నారు.

దే—(కోప ప్రకాశనయనములతో) ఇట్టిదానా? ఒక యమాయకురాలు మఱియొకని యపాయగ్రస్తతకుఁ గారణము కాఁగలదని నమ్ముచున్నావా? ఇట్టి భ్రాంతి వచనములు శ్రేయోభంగకరములని నీ వెఱుంగవనుట సత్యము. పాపము! ముగ్ధవు; నీవేమి తెలియఁగలవు?

ప్రక్కనున్న చిన్నయంత్రము కిటకిట ధ్వనిచేసి, వారి సంభాషణమున కంతరాయముఁ గల్గించెను. ఆసూచనను గ్రహించి యంబికాదేవి యటనుండి లేచిపోయెను. కొన్ని క్షణములలో గృహసేవకుఁడు—రామదాసు—దివ్యసుందరవిగ్రహుఁ డగు నూతనపురుషు నొక్కనిఁ గొనివచ్చి, దేవేంద్రనాథుని సమ్ముఖమున వదలిపోయెను. ఆ సౌందర్యమూర్తి యుమేశచంద్రుఁడని గుర్తించిన దేవేంద్రనాథుఁ డాశ్చర్యసంభ్రమ సమన్వితాంతరంగుఁడై పర్యంకమునుండి దిగ్గనలేచి, తీవ్రోత్సాహముతో నాతని గాఢాలింగనమాచరించి,యుచితాసనాసీనునిం జేసి,కుశలప్రశ్నము గావించెను.

దే—మీ రాకస్మికముగ నిట్లు కుటీరమును పావన మొనరింతు రని, యీ మందమతి తలఁచియుండలేదు. సంపూర్ణ కళలఁ దేఱు మీ వదనమండల మిమ్మెయిఁ బ్రకాశహీనముగఁ గన్పట్టుచున్న దేమి?

ఉ—మీపవిత్ర జిహ్వాగ్రమునుండి యశుభవార్త లెవ్వియు వెలువడఁజాలవనుట సహజమే కదా. మహానుభావా! హేమకుమారుని యారోగ్య మెట్లున్నది!

దే—(సవిచారముగ) అయ్యో! ఈవేదనోదంత మంతవఱకు వ్యాపించి మీ కోమలహృదయమునుగూడ బాధించెనా? ఈశ్వరానుగ్రహమున నాతఁ డావిషమదశను గడచి,మీపరిపూర్ణకృపావలోకనమునకుఁ బాత్రుఁడగుచున్నాఁడు. మీ యన్వేషణ ప్రయత్న మెంతవఱకు ఫలకారి యైనదో వినఁ గుతూహలమున్నది.

ఉ—దేశాంతరగతుఁ డయియున్న యువకునిగూర్చి మీరు ప్రశ్నించుచుంటిరి కాఁబోలు. ప్రపంచమున నా ఖలుఁడు జీవన్మృతుఁడయి యున్నాఁడు.

దే—ఏమీ! జీవన్మృతుఁడా!

ఉ—చిత్తము. ఆ మానవాధముఁడీయైహికప్రపంచమును దాఁటిపోయియుండకేని నామనఃపీడయు నంతటితో నొక్కమొగిఁ దీఱియుండెడిది. సాధువులను బాధించు నృశంసుఁడు జీవన్మృతుఁడుగాక మఱేమి?

దే—మీరు మీకుమారునిఁగూర్చియే సెలవిచ్చుచుంటిరి కదా?

ఉ—ఔను. ఎవనిఁ బ్రాణాధికునిగ భావించుచుండిరి. యే జీవనప్రియుని వ్యథోపశమనార్థ మీ రష్టకష్టములకు లోనైతిరో, యా హేమకుమారుని క్షతగాత్రునిగఁ జేసిన నికృష్టునిగూర్చి, ఖలుఁడని, నృశంసుఁడని, జీవన్మృతుఁడని—మఱేమని చెప్పవలెనో నాకుఁ గోఁపకున్నది.

దే—(ఉచ్చ్వపడి) ఆహా! అతఁడే, అరుద్రదత్తుఁడే, మీ కుమారుఁ డాతఁడే!

ఉ—(ఖిన్నుఁడై) మహాభాగా! ఆవిషయమై నాకమిత విచారము కలుగుచున్నది. మీప్రేమాల తలయెత్తి నిలుచుటకు నే నెంతమాత్రమును దగను. అప్రమత్తచిత్తునిఁ గుమారుఁడని చెప్పుకొనుటకు లజ్జింపవలసి యున్నది.

దే—మీవంటి సువిచారపరులకు నేను విన్నవింపఁ బనిలేదు. మహాభాగా! ప్రపంచమున సమస్తవృక్షజాతములయందును మధురఫలములే లభింపవు. వాని వలన లోకమున కొనఁగూడఁజాలని మేలు తిక్తఫలములవలనఁగూడ నొదవుచున్నది. మధురఫలములు కేవలము క్షుధాతురతను మాత్రము మాన్పును. తిక్తఫలము లన్నియో రుజలనుగూడఁ బాపుచున్నవి. మహనీయుఁడా! రుద్రదత్తుఁడు నిరంతరాయముగ శ్యామపురముఁ బ్రవేశించెనా?

ఉ—(వినమితవదనుఁడై) ధర్మమూర్తీ! మీ పవిత్రహృదయమునకు సముద్రమును సమానమే. మీరు భేదభావముడిగి శత్రువులనుగూడ మిత్రదృష్టిఁ జూడఁగంటిరి. ఉత్కృష్టమహిమాన్వితమగు నీ శీలసంరక్షణము మహాత్ములగు మీబోంట్లకుఁ దక్క నెవ్వరికి సాధ్యము? ఆ నిర్దయుని పాషాణహృదయముగూడ నవనీతము వలెఁ గరఁగిపోవుటకు మీ యమోఘప్రేమైకదృష్టిప్రసారము గాక మఱేమికారణము కాఁగలదు. ఆహా! పవిత్రవంతమైన ప్రేమ లోకము నెంత సత్వరముగఁ బావనము చేయఁగలదు. ఆ యమూల్యప్రేమభాగ్యము నన్నికడల సమానవ్యాప్తి నొందించు మహనీయుఁడే మాననీయుఁడుకదా?

దే—ప్రేమ మెచ్చుట లేదు. మీ హృదయకేదారమునఁ బ్రేమామృతము ప్రాదుర్భవించియుండనిచో మీ రిట్లు శ్రమగొని యింతదవ్వేల యరుదెంచియుందురు? మీ యాత్మజుని యందు మాత్ర మనురాగము లేదని యెవ్వ రనఁగలరు? లేకుండినచో నాతఁడు నా ప్రార్థన నాలించుటయు, దానిఁ బాలించుటయు నీవఱకు మి మ్మాలోకించియుండుటయు, సంభవమై యుండెడుకదా?

ఉ—అయ్యో! ఆ పాషండునిగూర్చి తలఁచుకొలఁది మానసము ఛిన్నాభిన్న మగుచున్నది. అందులకు నేను క్షమాపణఁ గోరఁదలఁచి యుండలేదు. మహాత్మా! మీ కుచితమని తోఁచిన దండనము, మీ రాక్రూరునకు విధింపుఁడు. నాకు నది పరమసమ్మతము. అట్లు గావించినఁగాని నా హృదయద్రుమము నలమికొని బాధించుచుండెడు ఖేదలతిక నన్నుఁ బాయఁజాలదు.

దే—(విస్మితుఁడై) మీరు మీ కుమారున కర్హదండన విధింప నా కాదేశించుచున్నారా? అయ్యో! దానిని మీఱుట నాకు భావ్యమైయుండదే! నేను విధించెడు దండనము మిగుల దుష్కరముగ నుండును. మీపుత్త్రుఁ డందువలన జీవితకాల మంతయు మహాబంధమునకు లోనై, యొకానొక దుస్తరజలనిధింబడి తత్ఫలముఁ గుడువవలసి యుండును.

ఉ—అవశ్య మనుభవించును: మీ రతని మహాగాఢ పంకకూపమునఁ ద్రోసినను మఱేమి యొనర్చినను నాకుఁ బరమసమ్మతము. ఆదుర్మదుఁ డెందుండి దరిఁజేరరాదు. —మీ రాజ్ఞాపించితిరి కాన, దాని నెంతమాత్రమును నే నతిక్రమింపఁజాలను. నేనేమి విధించినను మీరు నామోదించుట యవసరము. నా ద్వితీయ తనయ కాత్యాయని రుద్రదత్తునిఁ జెందును. నే నాకన్యచే, ఆ వీరునిబంధించి యాతని దరియే కడలేని సంసారసముద్రమునఁ ద్రోయఁ గృతసంకల్పుఁడనైతిని. మీ సుతున కుచితమగు దండనమిదియే. దీని కాతఁడు గుఱియై తీరవలెను. ఇది యీశ్వరాదేశము.

ఉమేశచంద్రుని హృదయాంతరాళమున నెట్టి భావముత్పన్న మయ్యెనో—అద్భుతమో, భయమో, సంభ్రమమో, సంతోషమో, మఱేమియో—తోఁపదు. తోడనే యాతని నయనారవిందములనుండి సలిలకణములు కొన్ని జలజల రాలెను. అవి యానందాశ్రువులో దుఃఖబాష్పములో బోధపడుటలేదు. దేవేంద్రనాథుని యమృతమయ వాక్యజాలమున కాతఁడేమియు నుడువ సాహసింపలేక, యనేక నిమిషములకాల మట్టె మౌనభావమున

"తమపై కర్కశశిలావృష్టిఁ గురియించుచున్నను, వృక్షరాజములు సౌమ్యభావమునఁ దుచ్ఛమానవులకు మనోహరామృతఫలములనే యొసంగుచున్నవి. ఆహా! ప్రపంచమున సజ్జనులధర్మ మీచందమున నొప్పారుచుండు ననుటకు, మిముఁబోలు మహనీయుల సుచారిత్రములే యాదర్శప్రాయములు."

హేమకుమారునకుఁ బ్రేమపూర్ణ నర్పించుటలో నుమేశచంద్రుఁడు వెనుదీయ సాహసింపలేదు. యుక్తసమయమునఁ బ్రేమపూర్ణాహేమకుమారులకును, కాత్యాయనీరుద్రదత్తులకును విభవాభిరామముగ వివాహము జరిగినది.